విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారధ్యంలో వస్తున్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
99492 22450
ప్రభాత సూర్య
www.suryaa.news

ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news

హైదరాబాద్
6-4-2026
వెల: రూ.5/-
పేజీలు: 8
సంపుటి: 09
సంచిక: 208

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



# బాసర ఆలయానికి కొత్త కళ

**రూ.225 కోట్లతో ఆలయం పునర్నిర్మాణం**

**9 అంతస్థుల రాజగోపురం, 7 అంతస్థులతో**

**మూడు దిక్కులా గోపురాల నిర్మాణాలు**

**మూడు రెట్లు పెరగనున్న ఆలయ విస్తీర్ణం**

**నేడు భూమిపూజ చేయనున్న సీఎం రేవంత్ రెడ్డి**

గోదావని నదీ తీరాన జ్ఞాన సరస్వతి అమ్మవారు కొలువై ఉన్న బాసర పుణ్యక్షేత్రం కొత్త కళను సంతరించుకోనుంది.

2లో



# రాములమ్మ గట్టి ప్రయత్నం!

**మంత్రి పదవి కోసం ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్**

**సీఎం రేవంత్ రెడ్డి సానుకూలం ..విస్తరణలో బెర్త్ ఖాయం**

తెలంగాణ రాజకీయాల్లో కీలక శక్తిగా మారాలని భావిస్తున్నారు విజయశాంతి. తెలంగాణ క్యాబినెట్లో చోటు కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇందుకు గాను ఆమె ఢిల్లీ బాట పట్టనున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీగా ఉన్న ఆమె ఇటీవల సౌండ్ పెంచారు. ఇటీవల శాసనమండలిలో మాట్లాడుతూ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేలా వ్యవహరించారు.

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :**

ప్రధానంగా తెలంగాణ ఉద్యమ సమయంలో అమరులైన వారి కుటుంబాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రూ.25 వేల భృతితో పాటు వారి కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఉద్యమకారులు లేనిదే ముఖ్యమంత్రులు, మంత్రులు లేరని.. అటువంటి వారికి న్యాయం చేయాల్సిన అవసరం ఉందని శాసనమండలిలో గట్టిగానే చెప్పుకొచ్చారు.

**మంత్రివర్గంలో చోటు కోసం..**

కీలకమైన మంత్రి పదవి కోసం ఆమె ఆశగా ఎదురు చూస్తున్నట్లు తెలుస్తోంది. మహిళా నేతగా, తెలంగాణ ఉద్యమ నాయకురాలిగా తనకు అవకాశం వస్తుందని ఆమె ఆశాభావంతో ఉన్నారు.

2లో



2లో

# కాంగ్రెస్‌లో అసంతృప్త జ్వాల!

**కట్టు దాటుతున్న క్రమశిక్షణ ..బాహటంగానే వ్యాఖ్యలు చేస్తున్న నేతలు**

**అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వాన్ని డిఫెన్స్ లో పెట్టిన నేతలు**

**హైదరాబాద్, ప్రభాత సూర్య :**కోమటిరెడ్డి సంచలన కామెంట్స్.. అసెంబ్లీలో నల్గొండ జిల్లా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అయితే ఏకంగా ప్రభుత్వం మీద విమర్శలు చేశారు. ఖమ్మం జిల్లాతో పాటు సీఎం సొంత నియోజకవర్గంలో చేసిన పనులకు మాత్రమే బిల్లులు చెల్లిస్తున్నారని.. ఇతర ప్రాంతాల్లో కాంట్రాక్టర్లకు పెండింగ్లో పెడుతున్నారని వాపోయారు. అంతటితో ఆగకుండా ఎమ్మెల్యేలు గెలవకపోతే సీఎం కానీ.. మంత్రులు కానీ ఎక్కడ అని లాజిక్ పాయింట్ లేవదీశారు. తన సొంత నియోజకవర్గంలో అభివృద్ధి పనులు సాగడం లేదని చెప్పుకొచ్చారు. ఎమ్మెల్యేలకు అభివృద్ధి నిధులు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాటలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పూర్తిగా డిఫెన్స్ లో పడేసాయి. కొంతకాలంగా



# రేవంత్ దే పై 'చేయి'!

**ముగిసిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు**

**ప్రతిపక్షాలను పూర్తిగా డిఫెన్స్ లో పెట్టిన ముఖ్యమంత్రి**

**హైదరాబాద్, ప్రభాత సూర్య**

తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసాయి. మార్చి 20న ప్రారంభమైన సభలు మొత్తం 11 రోజులపాటు కొనసాగాయి. రాష్ట్ర మంత్రి మల్లు భట్టి విక్రమార్క బడ్జెట్ను ప్రవేశపెట్టారు ఇదే సభలో. అయితే కెసిఆర్ హాజరవుతారని అంతా భావించారు.

కానీ ఆయన ఫామ్ హౌస్ కు పరిమితం అయ్యారు. కేటీఆర్ తో పాటు హరీష్ రావు నేతృత్వంలో గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. అధికారపక్షంతో

- మిగతా 2వ పేజీలో

# 'స్టార్టప్ స్టేట్' తెలంగాణ

**బీఆర్ఎస్ హయాంలోనే దిగ్గజ సంస్థలకు హైదరాబాద్ చిరునామాగా మారింది**

**ఏఐ, లైఫ్ సైన్సెస్, ఫిన్‌టెక్, అగ్రిటెక్ సమ్మేళనంతోనే వృద్ధి**

**కొలంబియా బిజినెస్ స్కూల్ 21వ వార్షిక ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్‌లో కేటీఆర్**




2లో

హైదరాబాద్: భారతదేశంలో అత్యంత విజయవంతమైన 'స్టార్టప్ స్టేట్'తెలంగాణ అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు అన్నారు. తెలంగాణ ప్రస్థానం అంటే ఆత్మగౌరవం, ఆకాంక్ష, పురోగతికి నిదర్శనమని చెప్పారు. అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ప్రతిష్టాత్మక కొలంబియా బిజినెస్ స్కూల్‌లో జరిగిన 21వ వార్షిక ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్‌లో ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు,

# జూరాలపై బ్రిడ్జి కమ్ బరాజ్

**స్థలాన్ని ఎంపిక చేయాలని మంత్రి ఉత్తమ్ ఆదేశం**

**నీటిపారుదల శాఖపై సమీక్షలో కీలక నిర్ణయం**



2లో

# భయానికి, భరోసాకు పోరు


**పశ్చిమ బెంగాల్‌లో మహా జంగిల్‌రాజ్: మోదీ**

**చొరబాటుదార్లను ఓటు బ్యాంకుగా మార్చుకున్న సీఎం మమత**

**మేము అధికారంలోకి రాగానే వారిని బయటకు పంపిస్తాం**

**బెంగాలీలు తలెత్తుకొని జీవించేలా చేస్తామన్న ప్రధాని**





# అమెరికాకు షాకిచ్చిన ఇరాన్.. ట్రంప్ బూతు పురాణం!

వాషింగ్టన్: ఇరాన్‌తో యుద్ధంలో అగ్రరాజ్యం అమెరికాకు ఊహించని ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఇరాన్‌పై యుద్ధంలో అమెరికా ఇప్పటిదాకా ఏకంగా 19 యుద్ధ విమానాలను కోల్పోయినట్టు ఓపెన్‌సోర్స్ ఇంటెలిజెన్స్ (ఓఎస్ఐఎన్‌టీ) నివేదిక పేర్కొంది. పలు హెలికాప్టర్లు, డ్రోన్లను కూడా ఇరాన్ కూల్చేసినట్టు వెల్లడించింది. ఈ జాబితాలో రూ.3,300 కోట్ల విలువైన నాలుగు ఎఫ్--15ఇ ఫైటర్ జెట్లు, రూ.174 కోట్ల విలువైన ఏ--10 థండర్‌బోల్ట్2 విమానం, రూ.740 కోట్లకు పైగా

# అమెరికాకు షాకిచ్చిన ఇరాన్.. ట్రంప్ బూతు పురాణం!

విలువ చేసే 2 కేసీ--135 ఇంధన ట్యాంకర్ విమానాలు, మరో 11 విమానాలున్నాయి. రూ.6,500 కోట్ల విలువైన బోయింగ్ ఇ3 సెంట్రీ ఎయిర్‌బోర్న్ వార్నింగ్ అండ్ కంట్రోల్ సిస్టమ్ విమానాన్ని సైతం ఇరాన్ సర్వనాశనం చేసింది. రూ.4,700 కోట్ల విలువైన 17 ఎంక్యూ--9 రకం రీపర్ డ్రోన్లను కూడా కూల్చేసింది.దహోర్ముజ్ జలసంధిని తక్షణమే తెరవాలని ఇరాన్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరించారు. ఆ క్రమంలో బూతుపురాణానికి దిగారు. "హోర్ముజ్‌ను తెరవండ్రా పిచ్చి బాస్టర్డ్స్! ఇందుకు సోమవారమే డెడ్‌లైన్. ఆలోపు తెరవలేదంటే నరకానికి పంపిస్తా. చూస్తూ ఉండండి. అల్లాను ప్రార్థించండి. మంగళవారం పవర్ ప్లాంట్ డే, బ్రిడ్జి డే. అవన్నీ ఒకేసారి జరుగుతాయి. ఇరాన్ విద్యుత్కేంద్రాలను, వంతెనలను సర్వనాశనం చేస్తాం" అంటూ ఆదివారం ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. హోర్ముజ్ తెరిచే విషయంలో ఎంత దూరమైన వెళ్తానని చెప్పారు. "సోమవారం నాటికి ఇరాన్‌తో చర్చల్లో పురోగతి సాధ్యం కావొచ్చు. మాతో ఒప్పందానికి రాకపోతే మాత్రం ఇరాన్‌ను అగ్నికి ఆహుతి చేస్తాం. అక్కడి చమురును కూడా స్వాదీనం చేసుకుంటాం" అంటూ హెచ్చరించారు.

# రాములమ్మ గట్టి ప్రయత్నం!

(మొదటి పేజీ తరువాయి)

కానీ మంత్రి పదవి ఆలస్యం కావడంపై ఆమె అసహనంతో గడుపుతున్నట్లు సమాచారం. తెలంగాణ ఉద్యమం ప్రారంభం అయిన సమయంలో తల్లి తెలంగాణ పార్టీని స్థాపించారు. తర్వాత కెసిఆర్ స్థాపించిన టిఆర్ఎస్ లో తన పార్టీని విలీనం చేశారు. ఆ పార్టీ తరఫున ఎంపీగా గెలిచి పార్లమెంట్లో అడుగు పెట్టారు. అయితే అదే కెసిఆర్ తో విభేదించి కాంగ్రెస్ బాట పట్టారు. కానీ అక్కడ సరైన గౌరవం దక్కలేదని భావించి బిజెపిలోకి వెళ్లారు. 2023 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో చేరి స్టార్ క్యాంపైనర్గా ప్రచారం చేశారు.

**రాజ్యసభ కాకుండా ఎమ్మెల్సీ..**

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో కీలక పదవి ఆశించారు. రాజ్యసభ పదవి చేపట్టి మరోసారి పార్లమెంట్లో అడుగు పెట్టాలని భావించారు. కానీ అనూహ్యంగా ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. అయితే మంత్రి పదవి హామీ తోనే ఆమెను ఎమ్మెల్సీగా చేసినట్లు అప్పట్లో ప్రచారం నడిచింది. వాస్తవానికి గత ఏడాది ఎటువంటి అంచనాలు లేని సమయంలోనే ఆమె ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. అందుకే ఇప్పుడు మంత్రి పదవి కోసం లాబీయింగ్ ప్రారంభించారు. కాంగ్రెస్ హై కమాండ్ పెద్దలతో తనకున్న సంబంధాలను దృష్టిలో పెట్టుకొని ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఈ ప్రయత్నాలు కొంత సానుకూలంగా జరుగుతున్నట్లు సమాచారం.

**రేవంత్ సానుకూలత..**

విజయశాంతి విషయంలో సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. ముఖ్యంగా ఆమె కాంగ్రెస్ పార్టీలో యాక్టివ్ అయితే విజయశాంతి చరిష్మను ఉపయోగించుకోవచ్చు అనేది రేవంత్ ఆలోచనగా తెలుస్తోంది. మరోవైపు రేవంత్ ప్రధాన టీమ్ లో విజయశాంతి చేరితే కాంగ్రెస్ పార్టీలో తన పట్టు పెరుగుతుందని రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు సమాచారం. తెలంగాణ ఉద్యమకారులకు కేసిఆర్ అన్యాయం చేశారని చెప్పే ప్రయత్నంలోనే విజయశాంతి శాసనమండలిలో మాట్లాడారని.. దాని వెనుక రేవంత్ వ్యూహం ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. మొత్తానికి అయితే వచ్చే క్యాబినెట్ విస్తరణలో రాములమ్మకు బెర్త్ ఖాయం అని తెలుస్తుండడంతో ఆమె అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# జూరాలపై బ్రిడ్జి కమ్ బరాజ్

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: జూరాల ప్రాజెక్టుకు ఎగువన కృష్ణానదిపై బ్రిడ్జి కమ్ బరాజ్ నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం జలసౌధలో ఆ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఈ అంశంపై ఏకాభిప్రాయం వ్యక్తమైంది. బ్రిడ్జి కమ్ బరాజ్‌ను నిర్మించే ప్రాంతాన్ని ఎంపిక చేయాలని ఉత్తమ్ ఆదేశించారు. జూరాల ప్రాజెక్టుకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టులో 1.66 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, నారాయణపూర్ జలాశయం నుంచి 0.5 టీఎంసీల ఊట నీరు వచ్చే అవకాశముందని అధికారులు వివరించారు. సకాలంలో ఈ నీరు రాకుంటే తాగునీటి అవసరాలకు 0.5 టీఎంసీల కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. గతేడాది కర్ణాటక నుంచి ఒక టీఎంసీ నీటిని విడుదల చేయించుకున్న విషయాన్ని గుర్తు చేశారు. చివరిదశలో ఉన్న ఆయకట్టు పంటలకు భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల నుంచి సాగునీరు అందించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. పంటల సాగునీటి అవసరాలు తీర్చడానికి ప్రణాళికాబద్ధంగా నీటిని సమర్థ రీతిలో వినియోగించాలని, ఈ బాధ్యత ఆయా ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్లు స్వయంగా తీసుకోవాలని చెప్పారు. ఆయకట్టు పంటలతోపాటు జలాశయాల్లో మిగిలి ఉన్న నిల్వలను తాగునీటి అవసరాలకు రక్షించాలని ఆదేశించారు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కింద 6.3 లక్షల ఎకరాల పంటల సాగు దాదాపుగా ముగిసిందని, అవసరమైన చోట సాగునీటి సరఫరా చేయాలని సూచించారు. ప్రస్తుత సీజన్‌లో కాల్వలకు నీటి సరఫరాను నిలుపుదల చేయడానికి ముందే తాగునీటి అవసరాలకు చెరువులను నింపుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని జలాశయాల్లో పూడిక తొలగింపునకు చర్యలు చేపట్టాలని మంత్రి ఉత్తమ్ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టులు, చెరువుల్లో పూడిక తొలగింపునకు సాధ్యాసాధ్యాలతో ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు.

# 'స్టార్టప్ స్టేట్' తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ పెట్టుబడిదారులను ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ సాధించిన ప్రగతిని వివరించారు. సుదీర్ఘ పోరాటం ద్వారా ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రం తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పరిపాలన, ఆవిష్కరణలు, ఆర్థిక వృద్ధిలో దేశానికే దిక్సూచిగా నిలిచిందన్నారు. 'మేము అవకాశాల కోసం ఎదురుచూడలేదు. వాటిని అందిపుచ్చుకోవడానికి అద్భుతమైన పాలసీలను తయారు చేశాం. మౌలిక సదుపాయాలను కల్పించాం. తద్వారా పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని కలిగించి వృద్ధిని సాధించాం'అని కేటీఆర్ వివరించారు.

2027లో భారత్ 80వ స్వాతంత్ర్య దినోత్సవానికి సిద్ధమవుతున్న వేళ కేవలం పదేళ్లలోనే తెలంగాణ సాధించిన ఆర్థిక ప్రగతి గర్వకారణమన్నారు. రాష్ట్రాన్ని, దేశాన్ని నడిపే నాయకత్వానికి స్పష్టత ఉంటే జవాబుదారీతనం పెరుగుతుందని.. తద్వారా అభివృద్ధి వేగవంతమవుతుందని చెప్పారు. భవిష్యత్తు గురించి కేవలం మాటలు చెప్పడం కంటే, దానిని మనమే సృష్టించడం ఉత్తమమైన మార్గమని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

**రాష్ట్రాలే దేశాభివృద్ధికి ఇంజన్లు.. దీన్ని కేంద్రం గుర్తించాలి..**

భారతదేశ సమాఖ్య స్ఫూర్తిని కేటీఆర్ ప్రస్తావిస్తూ దేశాభివృద్ధి కేవలం ఒకే రకమైన విధానాల వల్ల కాకుండా ప్రతి రాష్ట్రం తనకున్న ప్రత్యేక బలాలను వినియోగించుకోవడం ద్వారా సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. 'భారత్ 28 ఇంజన్లుగల ఒక ఫార్ములా--1 రేసింగ్ కార్ లాంటిది. ప్రతి రాష్ట్రం తనదైన శైలిలో అభివృద్ధి చెందుతూ దేశ ప్రగతికి తోడ్పడాలి. అంతర్జాతీయ పెట్టుబడి నిర్ణయాలు చివరికి రాష్ట్రాలు, నగరాల స్థాయిలోనే జరుగుతాయి'అని కేటీఆర్ గుర్తుచేశారు. ఐటీ, పారిశ్రామిక రంగంలో తెలంగాణ అద్భుత ప్రగతి సాధించిందని తెలిపారు. 2014 నుండి 2023 మధ్య కాలంలో తెలంగాణ సాంకేతిక రంగం సాధించిన గణాంకాలను కేటీఆర్ వివరించారు. ప్రభుత్వ వేగవంతమైన నిర్ణయాలు, పటిష్టమైన ఎకో సిస్టమ్ కారణంగానే హైదరాబాద్ గ్లోబల్ ఐటీ దిగ్గజాలకు చిరునామాగా మారిందన్నారు. హైదరాబాద్‌లో అమెజాన్ ప్రపంచంలోనే అతిపెద్ద క్యాంపస్‌ను ఏర్పాటు చేసిందని, గూగుల్, ఆపిల్, మెటా, సేల్స్ ఫోర్స్, ఉబర్, మైక్రాన్ టెక్నాలజీ వంటి సంస్థలు తమ కీలక కార్యకలాపాలను ఇక్కడ నిర్వహిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఆవిష్కరణలకు చిరునామా తెలంగాణ మారిందన్నారు. టీ--హబ్, వీ--హబ్, టీ--వర్క్స్, టాస్క్ వంటి సంస్థల ద్వారా తెలంగాణ ప్రభుత్వం ఆవిష్కరణలకు పెద్దపీట వేసిందని కేటీఆర్ వివరించారు. స్కైరూట్ ఏరోస్పేస్, డారి?వన్ బాక్స్, జెనోటి, హైరేడియస్ వంటి యూనికార్న్ సంస్థలు హైదరాబాద్ నుంచి పుట్టుకురావడమే తెలంగాణ సత్తాకు నిదర్శనమన్నారు. తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగంలో ప్రపంచానికే వ్యాక్సిన్ రాజధానిగా ఎదిగిందని.. ప్రపంచ వ్యాక్సిన్లలో మూడో వంతు ఇక్కడే ఉత్పత్తి అవుతున్నాయని కేటీఆర్ వెల్లడించారు. ఏటా 10 బిలియన్ డోసుల టీకాలను తెలంగాణ ఉత్పత్తి చేస్తోందని.. దేశీయ బల్క్ డ్రగ్ ఉత్పత్తిలో 40 శాతం వాటా తెలంగాణదేనని చెప్పారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పుల గురించి ప్రస్తావిస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద మల్టీపర్పస్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అయిన కాళేశ్వరం ద్వారా 45 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోందని వివరించారు.

# భయానికి, భరోసాకు పోరు

(మొదటి పేజీ తరువాయి)

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ 'మహా జంగిల్‌రాజ్'ను నడిపిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ మండిపడ్డారు. రాష్ట్రంలో ఈసారి అసెంబ్లీ ఎన్నికలు అధికార పార్టీ సృష్టించిన భయానికి, బీజేపీ ఇస్తున్న భరోసాకు మధ్య జరుగుతున్నాయని తేల్చిచెప్పారు. ఆదివారం ఉత్తర బెంగాల్‌లోని కూచ్‌బెహార్‌లో ఎన్నికల ప్రచార సభలో మోదీ ప్రసంగించారు. మాల్దా జిల్లాలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) విధుల్లో ఉన్న జ్యుడీషియల్ అధికారులపై అల్లరి మూకలు దౌర్జన్యానికి దిగి, నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండించారు. తృణమూల్ కాంగ్రెస్ పాలనలో శాంతి భద్రతలు పూర్తిగా దిగజారాయని ఆరోపించారు. చొరబాటుదార్లను ఇక్కడి పాలకులు ఓటు బ్యాంకుగా మార్చుకున్నారని ధ్వజమెత్తారు. అధికార పార్టీ ప్రోద్బలంతోనే పొరుగుదేశం నుంచి జనం అక్రమంగా వలస వస్తున్నారని, దాంతో స్థానికంగాజనాభా నిష్పత్తిలో విపరీతమైన మార్పులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. చొరబాటుదార్ల వల్ల ఎన్నో సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. జ్యుడీషియల్ అధికారులకు కూడా రక్షణ లేకపోతే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

# కాంగ్రెస్‌లో అసంతృప్త జ్వాల!

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి పదవి ఆశిస్తూ వస్తున్నారు. రాజగోపాల్ రెడ్డి. ఇప్పటికే ఆయన సోదరుడు కోమటిరెడ్డి మంత్రివర్గంలో ఉన్నారు. సమీకరణల దృష్ట్యా రాజగోపాల్ రెడ్డికి ఛాన్స్ దక్కడం లేదు. దీంతో తీవ్ర అసహనంతో ఉన్న రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీపై తిరుగుబాటు చేసినంత పని చేస్తున్నారు. ముఖ్యమంత్రి పదవిపై కూడా మాట్లాడుతున్నారు.

**రాములమ్మ విశ్వరూపం..**

శాసనమండలిలో చూస్తే ఎమ్మెల్సీ విజయశాంతి సారి కాంగ్రెస్ ప్రభుత్వం పై తనదైన శైలిలో విమర్శలు చేశారు. ఉద్యమకారులకు ప్రభుత్వం చేసిన న్యాయం ఏమిటని ప్రశ్నించారు. వారికి ఎన్నో రకాల హామీలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటుతున్న విషయాన్ని కూడా ప్రస్తావించారు. ఉద్యమంలో అమరులైన కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కూడా ఆమె డిమాండ్ చేశారు. 25 వేల రూపాయల గౌరవ భృతి కూడా ఇవ్వాల్సిందేనని తేల్చి చెప్పారు. ఉద్యమకారులు లేకుంటే సీఎం అయినా.. మంత్రులు అయినా ఉండేవారా అని ఆమె నిలదీసినంత పని చేశారు. అటు శాసనసభలో ఎమ్మెల్యే.. ఇటు శాసనమండలిలో ఎమ్మెల్సీ ఒకే తరహా వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఒక్కమాటలో చెప్పాలంటే సీఎంతో పాటు మంత్రుల ప్రస్తావన తీసుకురావడం చూస్తుంటే వారిలో అసంతృప్తి స్పష్టంగా కనిపిస్తోంది.

**క్రమేపీ మారుతున్న సీన్..**

ఇటీవల కాంగ్రెస్ పార్టీకి సీనియర్ నేత జీవన్ రెడ్డి గుడ్ బై చెప్పారు. గత కొంతకాలంగా అసంతృప్తితో ఉన్న ఆయన పార్టీని వీడారు. ఈ క్రమంలో కాంగ్రెస్ హై కమాండ్ పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ విమర్శలు చేశారు. అయితే నేరుగా సీఎంను టార్గెట్ చేస్తుండడం మాత్రం మారుతున్న పరిణామాలకు సంకేతం. ఇలా విమర్శలు చేస్తున్న వారంతా కాంగ్రెస్ పార్టీలో సీనియర్లు కావడం గమనార్హం. మంత్రి పదవులు దక్కలేదని.. తాము ఆశించిన స్థాయిలో గుర్తింపు దక్కడం లేదన్న వారు ఇప్పుడు బాహాటంగానే తమ అసంతృప్తిని వెళ్ళగకుతున్నారు. కొద్దిరోజులపాటు కాంగ్రెస్ పార్టీలో అసంతృప్త స్వరాలు పెద్దగా బయటపడలేదు. కానీ జీవన్ రెడ్డి బయటకు వెళ్లి పోవడం.. పార్టీలో సీనియర్లు ఉండగా తన సహచరుడు వేం నరేందర్ రెడ్డి కి రాజ్యసభ పదవి ఇవ్వడం.. శాసనసభలో ఎమ్మెల్యేలతో పాటు ఎమ్మెల్సీ గళం ఎత్తడం చూస్తుంటే మాత్రం.. కాంగ్రెస్ పార్టీలో పరిస్థితి అదుపు దాటుతోందన్న అనుమానాలు ఉన్నాయి. మరేం జరుగుతుందో చూడాలి..

# రేవంత్ దే పై 'చేయి'!

(మొదటి పేజీ తరువాయి)

ధీటుగా తలపడ్డారు. కానీ ఈ సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డిది పై చేయి అయినట్టు అయింది. ఒక వ్యూహం ప్రకారం ఆయన గులాబీ పార్టీ తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆ పార్టీని అడుగడుగునా ఇరకాటంలో పడేసారు.

**గట్టి యుద్ధం..**

ప్రాజెక్టుల నుంచి రాజకీయం వరకు అనేక అంశాలపై అధికార, ప్రతిపక్షాల మధ్య ఒక రకమైన యుద్ధం జరిగింది. కెసిఆర్ సభకు రాకపోవడం పై సీఎం రేవంత్ రెడ్డి పదేపదే కార్నర్ చేయడం కనిపించింది. కాళేశ్వరం విషయంపై అటు బిజెపిని.. ఇటు కేంద్రాన్ని సీఎం నిలదీశారు. గులాబీ పార్టీ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మరో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పై చేసిన వ్యాఖ్యలు, ప్రవర్తించిన తీరు తీవ్ర వివాదానికి దారి తీసింది. దీంతో కౌశిక్ రెడ్డి విషయాన్ని సభా హక్కుల సంఘానికి సిఫారసు చేయాలని సాక్షాత్ సీఎం రేవంత్ రెడ్డి కోరడం గమనార్హం.

**రేవంత్ హైలెట్..**

ఈ సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైలెట్ అయ్యారు. ముఖ్యంగా హరీష్ రావు కుటుంబం అవినీతికి పాల్పడిందని కాంగ్రెస్.. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి చెందిన రాఘవ కన్స్ట్రక్షన్ కంపెనీ అవినీతికి పాల్పడిందని బిఆర్ఎస్ పరస్పర ఆరోపణలతో సభ దద్దరిల్లింది. దీంతో చివరి రెండు రోజులు బీఆర్ఎస్ సభ్యులను సభ నుంచి సస్పెండ్ చేశారు. మొత్తంగా సీఎం రేవంత్ రెడ్డి బడ్జెట్ సమావేశాల్లో తనదైన ముద్ర చూపించగలిగారు. ఆయన ఏకకాలంలో అటు బిజెపిని.. ఇటు గులాబీ పార్టీని ఇరకాటంలో పెట్టగలిగారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి లాలూచీ రాజకీయాలు నడుస్తున్నాయి అంటూ గులాబీ పార్టీతో పాటు కాషాయ దళానికి లింక్ చేసి విమర్శలు చేశారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విషయంలో బిఆర్ఎస్ విమర్శలను తిప్పికొట్టే క్రమంలో.. హరీష్ రావు కుటుంబ అవినీతిని బయటపెట్టారు. ధరణి పోర్టల్ తో హరీష్ కుటుంబం అడ్డగోలుగా ఆస్తులు తగ్గించుకున్న విషయాన్ని అనూహ్యంగా బయటపెట్టి.. పూర్తిగా డిఫెన్స్ లో పడేశారు గులాబీ పార్టీని. మొత్తంగా చూస్తే బడ్జెట్ సమావేశాల్లో సీఎం రేవంత్ ఒక వ్యూహాత్మకంగా అడుగులు వేసినట్టు కనిపించారు.

# బాసర ఆలయానికి కొత్త కళ

(మొదటి పేజీ తరువాయి)

ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.225 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో ఆలయ పునర్ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం భూమిపూజ చేయనున్నారు. బాసర జ్ఞాన సరస్వతి ఆలయ ప్రాశస్త్యం తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా ప్రజలందరికీ తెలిసిందే. దక్షిణ భారతదేశంలోని ఏకైక జ్ఞాన సరస్వతి ఆలయంగా ఇది విరాజిల్లుతోంది. వసంత పంచమి నాడు ఈ ఆలయంలో అక్షరాభ్యాసం ఎంతో ఘనంగా జరుగుతుంది. ఈ సందర్భంగా తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించేందుకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారు. ఇలా అక్షరాభాస్యాలకు ఆలవాలమైన క్షేత్రం పునఃనిర్మాణంతో కొత్త శోభను సంతరించుకోబోతోంది. వేద వ్యాస మహర్షి ప్రతిష్ఠించిన ముగ్గురు అమ్మల ఆలయం ఆచారాలకు అనుగుణంగా సమున్నతమైన రాజగోపురం.. కోనేరు.. ఉత్తర ద్వారం అభివృద్ధి.. ధ్యాన మందిరాలతో మరింతగా భక్తుల మనస్సులను ఆకట్టకోనుంది. వేల ఏళ్ల ఘన చరిత్ర కలిగిన బాసర జ్ఞాన సరస్వతి ఆలయ పునః నిర్మాణం జరగనుంది. దక్షిణ గంగానదిగా గుర్తింపు పొందిన పవిత్ర గోదావరి నదీ తీరంలోని బాసర క్షేత్రంలో జ్ఞాన సరస్వతి దేవి కొలువుదీరిన సంగతి తెలిసిందే. కురుక్షేత్ర యుద్ధానంతరం ప్రశాంతత కోసం వేద వ్యాస మహర్షి గోదావరి తీరానికి వచ్చి బాసరలో నివసించారట. ఆ సమయంలో స్వయంగా వేద వ్యాస మహర్షి గోదావరి ఇసుకతో జ్ఞాన సరస్వతితో పాటు మహా లక్ష్మి, మహా కాళి అమ్మ వార్ల మూర్తులను ప్రతిష్ఠించారనేది స్థల పురాణం.

**రూ.225 కోట్లు కేటాయించిన ప్రజాప్రభుత్వం**

జ్ఞాన సరస్వతి కొలువైన క్షేత్రం కావడంతో ప్రతి ఏటా బాసరలో పెద్ద సంఖ్యలో పిల్లలకు అక్షరాభ్యాసాలు చేయిస్తుంటారు. వసంత పంచమి, ఇతర పర్వ దినాల్లో అక్షరాభ్యాసాలకు వచ్చే పిల్లలు, తల్లిదండ్రులు, వారి బంధువులు, భక్తులతో ఆలయం కిటకిటలాడుతుంది. ఈ బాసర జ్ఞాన సరస్వతి ఆలయానికి వేల ఏళ్ల చరిత్ర కలిగి ఉంది.అయితే ఈ ఆలయానికి తరలివచ్చే భక్తుల సంఖ్య విపరీతంగా పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం భక్తుల సంఖ్యకు తగినట్లు అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించింది.ఈ నేపథ్యంలో బాసర ఆలయ అభివృద్ధి చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పించారు. సంప్రదాయాలు, ఆచారాలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధి పనులు చేపట్టేందుకు మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. వేల ఏళ్ల ఘన చరిత్ర గల్గిన బాసర జ్ఞాన సరస్వతి ఆలయ పునః నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.225 కోట్లను కేటాయించింది. ఈ ఆలయ పునః నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి రేపు భూమి పూజ చేయనున్నారు.బాసర ఆలయ పునఃనిర్మాణ పనులకు మాస్టర్ ప్లాన్ రూపొందించే ముందు అధికారులు శృంగేరి పీఠాధిపతులతో సంప్రదించారు. గర్భాలయం, అర్ధ మండపం, రాజ గోపురం, ఇతర గోపురాలు, మాడ వీధులు, కోనేరు, ఉత్తర ద్వారాల నిర్మాణాలకు సంబంధించి పీఠాధిపతుల అనుమతులు తీసుకున్నారు. శృంగేరి పీఠాధిపతుల వారి సూచనలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు. జ్ఞాన సరస్వతి ఆలయంలో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని... భవిష్యత్ అవసరాల దృష్ట్యా ప్రస్తుతం 2 వేల చదరపు అడుగుల్లో ఉన్న గర్భాలయం, అర్ధ మండపాన్ని 5 వేల చదరపు అడుగులకు పెంచనున్నట్లు తెలుస్తోంది.




# పొట్టి మరి వాగు వద్ద బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేయాలి

## బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి

**రాజపేట, ఏప్రిల్ 05(ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం పొట్టి మరి వాగు దగ్గర బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేయాలని బిఆర్ఎస్ మండల అధ్యక్షులు సట్టు తిరుమలేష్ ఆధ్వర్యంలో సందర్శించిన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రాజపేట నుంచి యాదగిరిగుట్ట వరకు వెళ్లే ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నారు అని రాజపేట మండలం మొత్తం వ్యవసాయ ఆధారిత ప్రాంతం కాబట్టి అన్ని చెరువులను నింపాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యమైన మెటీరియల్ వాడాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు సట్టు తిరుమలేష్, జలసాధన సమితి అధ్యక్షులు, ఎర్ర గోకుల జస్వంత్, పట్టణ అధ్యక్షులు బెడద వీరేశం, బిఆర్ఎస్ మండల సర్పంచుల పురం ప్రెసిడెంట్ పల్లె సంతోష్ గౌడ్, కుర్రారం సర్పంచ్ బొడ్డు భాస్కర్ బొంగుని ఉప్పలయ్య, కాకల ఉపేందర్, అంకతి సుదర్శన్, అంకతి వెంకటేశం, పాండవుల బిక్షపతి, అంకతి నరసయ్య, రఘునాథపురం గ్రామ శాఖ అధ్యక్షులు కొండం రాజు, ఎర్రగుంట కిషన్, కుందనపల్లి నర్సిహుశీలు , తుంగ అక్షయ్, మోత్కుపల్లి బాలకృష్ణ, బొడ్డుల శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు

# నూతనంగా చేపట్టబోయే యు జీడీ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ....



మాదాపూర్ ప్రభాత సూర్య : మాదాపూర్ డివిజన్ పరిధిలోని గుట్టలబేగంపెట్ లో రూ.35 లక్షల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే యు జీ డీ నిర్మాణం పనులకు ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన చేసిన పీ ఏ సీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజి సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నాం అని, పలు కాలనీ లలో ప్రజల నుండి వచ్చిన వినతి మెరకు మా దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకొని ప్రత్యేక చొరవ తో ఈ ఆదివారం గుట్టలబేగంపెట్ లో రూ.35 లక్షల రూపాయల తో నిర్మాణము పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని పీ ఏ సీ చైర్మన్ గాంధీ తెలియచేసారు.అత్యవసరం ఉన్న చోట , నిత్యం పొంగుతున్న ప్రాంతలలోప్రథమ ప్రాధాన్యత గా పనులు పూర్తి చేస్తామని పీ ఏ సీ చైర్మన్ గాంధీ తెలియచేశారు. ఏ చిన్న సమస్య అయిన నా దృష్టికి కి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తామని, కాలనీ లలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ ,కాలనీలను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళుతు సమస్య రహిత ఆదర్శవంతమైన కాలనీ లుగా తీర్చిదిద్దడమే నా ప్రథమ లక్ష్యం అని పీ ఏ సీ చైర్మన్ గాంధీ తెలియచేసారు. గుట్టల బేగంపేట్ కాలనీలో గల ఎన్నో ఏండ్ల సమస్య నేటి తో తిరునని, నిత్యం పొంగుతుండటం వలన కాలనీ వాసులు ,ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు అని వాటిని దృష్టిలో పెట్టుకొని ఈ రోజు యు జీ డీ పైప్ లైన్ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేయడం జరిగినది అని, అదేవిధంగాప్రతి కాలనీలలో స్వచ్ఛమైన మంచి నీటి పైప్ లైన్ నిర్మాణం చేపట్టడం ద్వారా కాలనీ వాసులకు ప్రజలకు, స్వచైమన మంచి నీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని పీ ఏ సీ చైర్మన్ గాంధీ అన్నారు.యూ జీ డీ మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, ఉగడ్ పైప్ లైన్ వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని ,నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని , ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని గాంధీ చెప్పడం జరిగినది. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పీ ఏ సీ చైర్మన్ గాంధీ అధికారులను ఆదేశించడం జరిగినది ,శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ,అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటానని ,మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని ,నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని, అదేవిధంగా సంక్షేమం మరియు అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకం లో శేరిలింగంపల్లి నియోకజకర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన ,అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదితానని పీ ఏ సీ చైర్మన్ గాంధీ తెలియచేసారు.మంజూరైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన వివరాలు గుట్టలబేగంపేట్ లో రూ.35 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టబో యూ జీ డీ భూగర్భ డ్రైనేజి నిర్మాణం పనులకు శంకుస్థాపన చేయడం జరిగినదిపైన పేర్కొన్న యు జీ డీ నిర్మాణము పనులకు శంకుస్థాపన చేయడం జరిగినది అనిపీ ఏ సీ చైర్మన్ గాంధీ తెలియచేసారు.ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు డీజీమ్ నరేందర్, సూపర్వైజర్ మనోజ్,మరియు నాయకులు, కార్యకర్తలు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు, స్థానికవాసులు తదితరులు పాల్గొన్నారు.



# శాంతి భద్రతలను కాపాడడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం...

**ప్రభాత సూర్య నర్సాపూర్ ఏప్రిల్ 05 :** రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పుట్టినరోజు సందర్భంగా తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు అన్నారు. తనపై అందరి ప్రేమ ఆదర అభిమానాలు ఆశిస్సులు తనకు మరింత శక్తిని ఉత్సాహాన్ని ఇచ్చాయన్నారు. కాగా గజ్వేల్ లో మాజీ సీఎం కేసీఆర్ క్యాంప్ కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడిని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి ఘటనలు జరగడం అత్యంత దురదృష్టకరమన్నారు. ప్రజల సమస్యలను వినిపించకునే ప్రదేశాలపై దాడులు జరగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. రాష్ట్రంలో దాడులు, విధ్వంసాలు పెరుగుతుండడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. రాష్ట్రాన్ని దశాబ్ద కాలంగా సమర్థవంతంగా పరిపాలించిన కేసీఆర్ క్యాంప్ కార్యాలయానికి రక్షణ కల్పించలేని పరిస్థితి ఏర్పడడం దురదృష్టకరమని తెలిపారు. పోలీసులు తక్షణమే స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుతూ శాంతి భద్రతలను పటిష్టం చేయాలని ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు.

# బాబూ జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు...!

**ప్రభాత సూర్యచండూర్:** చండూరు మున్సిపాలిటీ పరిధిలో స్వాతంత్ర్య సమరయోధులు, భారత తొలి దళిత ఉప ప్రధానమంత్రి, దళిత జాతి అభివృద్ధికై ఎంతో కృషి చేసిన మహనీయులు డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు మాదిగ సంఘాల నాయకుల ఐఖ్య వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు..ఐఖ్య వేదిక నాయకులు కురుపాటి గణేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక మెయిన్ సెంటర్ లో బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నిరుపేద దళిత కుటుంబంలో జన్మించిన బాబూజీ ఎన్నో అవమానాలు ఎదురైనా దళిత జాతి అభివృద్ధి కోసం, సామాజిక సమానత్వం కోసం ఎంతో కృషి చేశారని, స్వతంత్ర భారతదేశంలో కేంద్ర మంత్రిగా, తొలి ఉప ప్రధానమంత్రిగా సేవలందించారని ఆయన సేవలను కొనియాడారు. జగ్జీవన్ రామ్ గారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాదిగలు ఏ పార్టీలో ఉన్నా, ఏ సంఘంలో పనిచేస్తున్నా జాతి ప్రయోజనాల కోసం సమిష్టిగా, ఐఖ్యతతో పనిచేయాలని ఆకాంక్షించారు..ఈ కార్యక్రమంలో నాయకులు కురుపాటి సుదర్శన్, ఇరిగి వెంకటేశం, అన్నెపర్తి యాదగిరి, ఇరిగి శంకర్, ఆడెపు పరమేష్, కురుపాటి శ్రవణ్, శాక నర్సింహా, రామ్మోహన్, బుచ్చాల ప్రవీణ్, తాడిశెట్టి సంతోష్, ఇక్బాల్, తదితరులు పాల్గొన్నారు...





# ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలి... వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జూకంటి పౌల్..

**ఆలేరు ఏప్రిల్ 5 ప్రభాత సూర్య:** భూమి లేని వ్యవసాయ కార్మికులకు ఏడాదికి 12,000 ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జూకంటి పౌలు డిమాండ్ చేశారు. ఆదివారం ఆలేరు మండలం కేంద్రంలోని సుందరయ్య భవనములో మండల కమిటీ సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని విబిజి ఆర్ఎంఓ జి పేరుతో కొత్త బిల్లును తీసుకొని వచ్చిందన్నారు. పాత పద్ధతిలో ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీలో పని చేస్తున్న కూలీలను రెండు పూటలా ఫోటో తీసే విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కూలీలకు 200 రోజులు పని కల్పించాలని రోజుకూలిన 600 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సవరించిన వ్యవసాయ కార్మికుల వేతనాలను అమలు చేసి గ్రామ సభలు నిర్వహించి పెరిగిన కూలిని రేట్లను గ్రామంలోని ప్రచారం చేయాలని కోరారు. 50 సంవత్సరాలు నిండిన వ్యవసాయ కార్మికులకు 7000 పింఛన్ ఇవ్వాలని అన్నారు. కూలీలకు పని ప్రదేశంలో తాగునీటిని ,టెంట్లు, ఎయిడ్ మెడికల్ కిట్టులను అందుబాటులో ఉంచాలని కోరారు. పెండింగ్లో ఉన్న బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు బొమ్మకంటి లక్ష్మీనారాయణ, మిట్ట శంకరయ్య, కేతావత్తు లక్ష్మి ,పుట్టలరత్నం ,చౌడబోయిన యాదగిరి, ఎలగందుల రాములు, జాలపు లక్ష్మి , ఉప్పలయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల పోచమ్మ దేవాలయం పున:ప్రతిష్టపాన లో గౌరవ పీ ఏ సీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ....



**మాదాపూర్ ప్రభాత సూర్య:** మాదాపూర్ డివిజన్ పరిధిలోని గుట్టలబేగంపెట్ లో గల శ్రీ పిల్లల పోచమ్మ దేవాలయం పున:ప్రతిష్టపాన కార్యక్రమంలో సీనియర్ నాయకులు శ్రీ ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన గౌరవ పీ ఏ సీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు, భక్తులు,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# తంగడపల్లి లో ఘనంగా మహనీయులు బాబు జాగ్జీవన్ రామ్ జయంతి



సూర్య ప్రతినిధి చౌటుప్పల్: చౌటుప్పల్ మున్సిపాలిటీ తంగడపల్లి లో మహనీయులు బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు జయంతి కమిటీ అధ్యక్షుడు ఉదరీ వెంకటేష్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించడం జరిగింది.జగ్జీవన్ రాం ఏప్రిల్ 5, 1908 జన్మించారు, పేరొందిన స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘ సంస్కర్త. రాజకీయవేత్త. బీహార్లోని వెనుకబడిన వర్గాలనుంచి వచ్చాడు. అతను బాబూజీగా ప్రసిద్ధుడు. భారత పార్లమెంటులో నలభై ఏళ్ళపాటు వివిధ మంత్రి పదవులు నిర్వహించడమే కాకుండా ఉపప్రధానిగా వ్యవహరించాడు. 1935లో అంటరాని వారికి సమానత్వం కోసం అంకితమైన ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ అనే సంస్థను స్థాపించడంలో అతను కీలక పాత్ర పోషించాడు.1937లో బీహార్ శాసనసభకు ఎన్నికయ్యాడు, ఆ తర్వాత గ్రామీణ కార్మిక ఉద్యమాన్ని నిర్వహించాడు.తాను చేసిన సేవలు స్మరించుకునారు. ఈ యొక్క కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకయ్య ,4 వ వార్డు కౌన్సిలర్ ఉదరీ యాదయ్య, 15వ వార్డు కౌన్సిలర్ గడ్డం ఇందిరా రాజారత్నం,మాజీ ఎంపీటీసీ గ్యార కిష్ణయ్య, గౌరవ సలహాదారులు ఊదరి బాబురావు ఊదరి కిషోర్ బొజ్జ బుచ్చయ్య, దాసరి లింగస్వామి, ఉప్పలపల్లి లింగస్వామి, ఇప్ప వెంకటేష్, ఊదరి శ్రీనివాస్, ఎడ్ల లింగస్వామి, ఊదరి సురేష్, ఊదరి గణేశ్ , ఊదరి మహేశ్, జనగాం సురేశ్ ,ఊదరి సుభాష్, దాసరి వినయ్, దాసరి సాయితేజ, కొండగడప వివేక్ ,ఉదరీ ప్రకాశ్ ఉబ్బు పవన్ తదితరులు పాల్గొన్నారు



# అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్

**మిర్యాలగూడ ఏప్రిల్ 5:-( ప్రభాత సూర్య):** భారత రాజకీయ చరిత్రలో ధ్రువతార, అణగారిన వర్గాల ఆశాదీపం మాజీ ఉప ప్రధాని బాబుజగ్జీవన్ రాం 119వ జయంతి సందర్భంగా మిర్యాలగూడ పట్టణం ఆయన విగ్రహానికి శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్, మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్ వేసి ఆదివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూపవిత్ర రోజు మహనీయుని స్మరించుకోవడం మనందరి బాధ్యతన్నారు.బాబుజీ వివక్షను ఎదుర్కొంటూనే ఉన్నత విద్యను అభ్యసించి, గాంధీజీ పిలుపుతో స్వాతంత్ర్య పోరాటంలో దూకారు. అంటరానితనం నిర్మూలన, దళితుల, వెనుకబడిన తరగతుల సాధికారతకు చేసిన కృషి అనిర్వచనీయమన్నారు. బాబుజీ కేవలం ఒక కులానికో, వర్గానికో పరిమిత నాయకుడు కాదు, ఒక సామాజిక విప్లవకారుడన్నారు.సుమారు 32 ఏళ్ల పాటు కేంద్ర మంత్రిగా పనిచేసి, అత్యధిక కాలం క్యాబినెట్ మంత్రిగా రికార్డు ఆయన సొంతమని అన్నారు. రక్షణ మంత్రిగా 1971 భారత్-పాక్ యుద్ధంలో దేశానికి అఖండ విజయాన్ని అందించడంలో ఆయన పాత్ర మరువలేనిదన్నారు.దేశం ఆహార సంక్షోభంలో ఉన్నప్పుడు వ్యవసాయ మంత్రిగా హరిత విప్లవం ద్వారా దేశాన్ని ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి దిశగా నడిపించారన్నారు.నేడు అనుభవిస్తున్న సామాజిక న్యాయం వెనుక బాబుజీ వంటి మహనీయుల త్యాగాలు ఉన్నాయన్నారు. ఆయన చూపిన బాటలో నడుస్తూ, సమాజంలోని ప్రతి వ్యక్తికి సమాన అవకాశాలు అందేలా చూడటమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళన్నారు. కార్యక్రమంలో పలు కుల సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

# కార్పొరేట్ విద్యకే ప్రాధాన్యతన్నిస్తున్న సిఎం

## టిఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసచారి



**మిర్యాలగూడ, ఏప్రిల్ 5:-( ప్రభాత సూర్య):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలలకు ప్రాధాన్యత ఇవ్వకుండా కార్పొరేట్ విద్యకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆయన చేసిన వ్యాఖ్యలతో విశదమవుతుందని టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బక్కా శ్రీనివాసచారి అభిప్రాయపడ్డారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక గ్లోబల్ పాఠశాల ప్రారంభోత్సవంలో సిఎం ప్రభుత్వ పాఠశాలల పట్ల చేసిన వ్యాఖ్యలు ఆయనను కార్పొరేట్ విద్యా వ్యాపారానికి బ్రాండ్ అంబాసిడర్ గా నిరూపిస్తున్నాయని ఆయన విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా తన విద్యాభ్యాసం అంత ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో జరిగిందని చెప్పిన సీఎం లాంటి వ్యక్తి కార్పొరేట్ విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం బాధాకరమన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అభ్యసనా సామర్థ్యాలు దాదాపు ఒకేవిధంగా ఉన్నాయని అసర్, నాస్ తదితర సర్వేలలో తేటతెల్లమైందని, కానీ ఆ విషయాన్ని విస్మరించి కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోనే అభ్యసనా సామర్థ్యాలు లోపించాయని మాట్లాడటం ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేయడానికే దోహదం చేస్తాయన్నారు. విద్యాశాఖ మంత్రి శాఖ ఉన్న ముఖ్యమంత్రి ఒక కార్పొరేట్ పాఠశాల ప్రారంభోత్సవానికి హాజరు కావడమే సమంజసంగా లేదని . అది కూడా ఒక ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కార్పొరేట్ వ్యాపారాన్ని సమర్థిస్తూ, అక్కడ ప్రైవేటు పాఠశాలలో కంటే ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిపై ఖర్చు ఎక్కువగా అవుతున్నట్లు పేర్కొనడమంటే పరోక్షంగా ప్రైవేటీకరణను, కార్పొరేట్ వ్యవస్థను ప్రోత్సహించడంగానే భావించాలన్నారు . ప్రభుత్వ విద్యను కించపరిచేలా సిఎం చేసిన వ్యాఖ్యలను టిఎస్ యుటిఎఫ్ తీవ్రంగా ఖండించిందన్నారు.రాష్ట్రంలో పర్యవేక్షణ అధికారులు లేరు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత ఉంది, ఉపాధ్యాయుల అసమతుల్యత , ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ లేకపోవడం లోపాలు వీటిని సరిదిద్దేందుకు కృషి చేయకపోవడం శోచనీయమన్నారు. 15 శాతం బడ్జెట్ కేటాయిస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత మూడో విడత బడ్జెట్ లో కూడా 8.22 శాతం దాటలేదని, యంగ్ ఇండియా, టిపిఎస్ పేరుతో జనాకర్షక పాఠశాలలు కాకుండా ప్రజలందరికీ అందుబాటులో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ డిమాండ్ చేస్తుందన్నారు.

# చిన్నారిని ఆశీర్వదించిన తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం నరేష్

**ఖమ్మం( ప్రభాత సూర్య ప్రతినిధి ):** తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం బోనకల్ మండల అధ్యక్షులు పెద్దబీరెల్లి గ్రామీణ వైద్యులు గుర్రం సురేష్ కుమార్తె హితేక్ష అన్నప్రసన కార్యక్రమానికి హాజరైన తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘ రాష్ట్ర అధ్యక్షులు దాసరి నరేష్ జిల్లా అధ్యక్షులు మర్రి నరేష్ జిల్లా కార్యవర్గ సభ్యులు కాకటి కరుణాకర్ మండల కార్యవర్గ సభ్యులు వై డేవిడ్ సంఘ సభ్యులు హాజరై ఆశీర్వదించారు.





# ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక భాగంగా విజయవంతంగా హ్యాపీ సండే కార్యక్రమం మున్సిపాలిటీ చైర్మన్

# డాక్టర్ కోడి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి





**ప్రభాత సూర్య చండూరు :** స్థానిక చండూరు మున్సిపల్ కార్యాలయము నందు ఆదివారం నాడు బాబు జగ్జీవన్ రామ్ గారి జయంతి సందర్భంగా మున్సిపల్ పాలకవర్గము మరియు కమిషనర్ గార్లు ఘనంగా పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. అదేవిధంగా "హ్యాపీ సండే" కార్యక్రమములో భాగంగా ఉదయం: 9:00 గంటలకు గాంధీజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు స్కూల్ విద్యార్థులతో యోగా కార్యక్రమము నిర్వహించడం జరిగింది. తదుపరి 3వ వార్డులో డిగ్రీ కాలేజీ ప్రక్కన గంజి భ్రమరాంభ గారి ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశ కార్యక్రమములో పాల్గొనడం జరిగింది. ఇట్టి కార్యక్రమం లో మునిసిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ యోగ చేయడం మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉంటారని, ప్రతి రోజూ యోగ చేయడం అలవాటు చేసుకోవాలని పాఠశాల విద్యార్థులకు చెప్పారు. మరియు తెలంగాణా ప్రజా ప్రభుత్వశీ ప్రతిష్టాత్మకశీగా చేపట్టిన ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం వలన నిరుపేదలకు సొంత ఇంటికల నెరవేరిందని, పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరిందని, పేదలకు ఇందిరమ్మ ఇండ్లు గొప్ప వరమని అన్నారు. మున్సిపల్ కమీషనర్ ఎల్. మల్లేశం మాట్లాడుతూ యోగ చేయడంవలన మనసు ఏకాగ్రత మరియు చదువు పైన ద్రుష్టి సాదిస్తారని పాఠశాల విద్యార్థులకు చెప్పడం జరిగింది మరియు ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి తెలంగాణా ప్రభుత్వశీ అందిస్తున్న ఆర్థిక సహాయం పేద ప్రజలకు చాల ఉపయోగ పడుతుందని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమములలో వైస్ చైర్ పర్సన్ భూతరాజు దశరథ, కౌన్సిల్ సభ్యులు శ్రీమతి తెలుకుంట్ల రాజకుమారి, బుషిపాక వాసు, సామ సుజాత, జెల్ల ధనమ్మ, కోన్రెడ్డి మధు, కోడి సుష్మవెంకన్న, కటకం రమేష్, అయుష్ యోగ ఇన్స్ట్రక్టర్ ఇడికూడా వెంకటేష్,వార్డు ఆఫీసర్స్ శ్రీరాములు,సాయి రామ్,ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ వీ.అరవింద్ రెడ్డి, బిల్ కల్లెక్టర్స్ మహేష్,రమేష్,మంజుల,మెప్మ సిబ్బంది, పాఠశాల విద్యార్థులు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొనడం జరిగింది..



# తెలంగాణ రాష్ట్ర భట్రాజు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షునిగా డాక్టర్ టి.వి. పుల్లంరాజు

**ఖమ్మం( ప్రభాత సూర్య ప్రతినిధి ):** తెలంగాణ రాష్ట్ర భట్రాజు సంఘం ఖమ్మం జిల్లా నూతన అధ్యక్షునిగా డాక్టర్ తోకచిచ్చు వెంకట పుల్లంరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఉదయం ఖమ్మం పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల పీఆర్ హోటల్ బాంక్వెట్ హాల్లో జిల్లా కమిటీ మహిళా యువజన సంఘాల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. రాష్ట్ర కమిటీ ప్రతినిధి ప్రతికంఠం దేవేందర్ రాజు ఎన్నికల అధికారిగా ఆదూరి కళాధర్ రాజు పర్యవేక్షకులుగా ఈ ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు.అధ్యక్షునిగా డాక్టర్ పుల్లంరాజు గతంలో ఖమ్మం పట్టణ జిల్లా రాష్ట్ర కార్యదర్శిగా అలాగే ఖమ్మం భట్రాజు వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడిగా విశేష సేవలందించిన డాక్టర్ పుల్లంరాజును జిల్లా అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. జిల్లాలో పలు ఆధ్యాత్మిక స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ అన్ని వర్గాలతో సత్సంబంధాలు కలిగి ఉండటం ఆయన ప్రత్యేకత.ప్రధాన కార్యదర్శిగా సరికొండ రవికిరణ్ రాజు కోశాధికారిగా తంగెళ్ల వినోభారాజు తో పాటు మరో 18 మందితో కూడిన నూతన జిల్లా కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.మహిళా విభాగం అధ్యక్షురాలుగా అంపోజ్వాలం అరుణాదేవి కార్యదర్శిగా రాళ్లబండి నిర్మల కోశాధికారిగా సరికొండ విజయలక్ష్మి తో పాటు మరో 8 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

# ప్రతి గ్రామంలో బీజేపీ పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి



**మిర్యాలగూడ, ఏప్రిల్ 5:-( ప్రభాత సూర్య) :** వేములపల్లి మండలం బుగ్గబావిగూడెం గ్రామంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షులు పెదమాం భరత్, ఇటిక్యాల జాన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మండల ప్రశిక్షణ తరగతులకు ముఖ్య అతిథులు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి తోటపల్లి రవికుమార్, బిజెపి కిషన్ మోర్చా జాతీయ నాయకులు గోలి మసుదన్ రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాధగోని శ్రీనివాస్ గౌడ్, నూకల నరసింహారెడ్డి, సాధినేని శ్రీనివాసరావు, రాష్ట్ర మీడియా ప్యానల్ సభ్యులు పల్నాటి వెంకటరెడ్డి, రాష్ట్ర నాయకులు రేపాల పురుషోత్తంరెడ్డి వివిధ అంశాలపై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రతి ఒక్కరు తప్పక పాటించాలని అత్యోదయ ఏకాత్మత వాదం , పార్టీ అభివృద్ధి, పార్టీ విస్తరణకు ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని వచ్చే ఎన్నికల్లో తప్పక పార్టీ అధికారంలోకి వస్తుందని కష్టపడ్డ వారికి పార్టీలో తప్పక గుర్తింపు ఉంటుందని . గత 12 సంవత్సరాలుగా బిజెపి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికి అందేలా ప్రతీ కార్యకర్త నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ పని చేయాలని అలాగే ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ నిత్యం ప్రజల్లో ఉండాలని ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యకర్తలకు ఏ అవసరమున్నా నిత్యం అందుబాటులో ఉంటారని హామీ ఇచ్చారు. సమావేశంలో బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు గడ్డం వెంకటరెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు బొమ్మకంటి నరసింహ, మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి పందిరి భాగ్యమ్మ,, బిజెపి మండల ప్రధాన కార్యదర్శులు నిమ్మల జాన్ రెడ్డి, లక్ష్మణ్, నాయకులు కడియం సైదులు, బోల్లెదు లవయ్య, పెదమం ప్రసాద్, ఇరుగుదిండ్ల నరేష్, పెదమాం వెంకటేశ్వర్లు, తమ్మి నారాయణ, పగిడిపల్లి సోమయ్య, చింతకాయల సైదులు,, మానపూరి పురుషోత్తం, కేతనపల్లి భూపాల్ రెడ్డి, సోమ బోయిన నరేష్, దశరథ, నాగరాజు, సత్యనారాయణరెడ్డి, దుండిగాల రేణుక, బంటు సరిత, వనం విజయ, ఈట మహేష్, ప్రభాకర్ పాల్గొన్నారు



# డాక్టర్ బాబు జగ్జీ వన్ రామ్ గొప్ప సంఘసంస్కర్త

**మర్రిగూడ ఏప్రిల్ 5 ప్రభాత సూర్య :** మర్రిగూడ లోని గ్రామపంచాయతీ కార్యాలయంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119 వ జయంతిని మర్రిగూడ సర్పంచ్ వీరమల్ల శిరీష లోకేష్ గౌడ్ ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు వారు మాట్లాడుతూ అణగారిన వర్గాల సంక్షేమం కోసం అలుపెరుగని ఉద్యమం చేసిన గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు ఈ కార్యక్రమంలో, సీనియర్ జర్నలిస్ట్ మహేశ్వరం సతీష్, రాములు చెరుకు శ్రీరాములు,వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# రామకృష్ణ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జనంపల్లి పురేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

## కేక్ కట్ చేయించి ఘనంగా సన్మానం చేసిన యూత్ కమిటీ సభ్యులు



**కూకట్ పల్లి, ఏప్రిల్ 05 (ప్రభాత సూర్య) :** రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు రామకృష్ణ గణేష్ ఉత్సవ యూత్ కమిటీ సభ్యులు, యూత్ అధ్యక్షులు భార్గవ్ కార్యదర్శి, నందు ట్రెజరర్, అశ్విత్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది యూత్ కమిటీ సభ్యులు ఆయనకి ఘనంగా సన్మానం చేసి కేక్ కటింగ్ చేసి స్వీట్లు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ గణేష్ తాండవ కృష్ణ, శ్రీధర్, సుధాకర్, సంజీవరెడ్డి, ప్రసాద్, జి నర్సింగరావు, వెంకటేశ్వరరావు, జలంధర్ రెడ్డి, ఈ రాజేందర్, కాశీనాథ్, యాదవ్, సి కె రెడ్డి, అరవింద్ రావు, కమిటీ సభ్యులు, యూత్ కమిటీ సభ్యులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని శాలువలతో సన్మానం చేసి కేకులు కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నర్సింగరావు, ప్రసాద్, శ్రీధర్ రావు, గణేష్ ఆధ్వర్యంలో భోజనం ఏర్పాట్లు ఘనంగా చేశారు.



# రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలి :ఐద్వా డిమాండ్



**భువనగిరి, ఏప్రిల్ 05(ప్రభాత సూర్య):** రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) భువనగిరి మండల అధ్యక్ష , కార్యదర్శులు రాసాల నిర్మల , కొండమడుగు నాగమణి డిమాండ్ చేసినారు. ఆదివారం భువనగిరి మండల పరిధిలోని బస్వాపురం గ్రామంలో ఐద్వా ఇంటింటి సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారం చేపడితే మహిళలకు నెలనెలా 2500 రూపాయలు ఇస్తామని, పెళ్లి చేసుకున్న ప్రతి ఆడబిడ్డకు కళ్యాణ లక్ష్మి డబ్బులతోపాటు తులం బంగారం ఇస్తానని చెప్పి అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు గడిచిన ఎందుకు అమలు చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. భూమిలేని ప్రతి కుటుంబానికి సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇస్తానని చెప్పి నేటికీ అమలు చేయడం లేదని అన్నారు. మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణము అమలు చేస్తున్న పట్టణాలకు తప్ప గ్రామాలకు ప్రభుత్వ బస్సులు వచ్చే పరిస్థితి లేదని తెలిపారు. గ్యాస్ సబ్సిడీ అన్నారు కానీ అందరికీ రావడం లేదని, పెన్షన్ పెంపుదల లేదని, వృద్ధ మహిళలకు, భర్తలు చనిపోయిన వితంతులకు, ఒంటరి మహిళలకు గత ఆరేడు సంవత్సరాలుగా పెన్షన్లు గత ప్రభుత్వం ఈ ప్రభుత్వము ఇవ్వడం లేదని విమర్శించారు. మరో పక్క ఉపాధి హామీ పథకంలో నూటికి 90 శాతం పనిచేస్తున్న మహిళలకు జాబు కార్డు కోసం ఎవరన్న దరఖాస్తు చేసుకుంటే ఇచ్చే పరిస్థితి లేదని అన్నారు. మరో పక్క రాష్ట్రంలో, దేశంలో మహిళల పైన దాడులు, దౌర్జన్యాలు హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయని ఆవేదన వెలిబుచ్చారు. మహిళల రక్షణ కోసం చట్టాలు ఉన్న సరిగా అమలు కావడం లేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం, మహిళల రక్షణ కోసం ఐక్యంగా మహిళలు ఉద్యమాలకు సిద్ధం కావాలని నిర్మల నాగమణి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దూసరి మానస, బుగ్గ రేణుక, కొండమడుగు భూమమ్మ, రాసాల వెంకటమ్మ , అన్నంపట్ల మైసమ్మ, రాసాల గ్రహణమ్మ , అన్నంపట్ల భాగ్యమ్మ , కొండమడుగు నవనీత, అన్నంపట్ల తిరుమల తదితరులు పాల్గొన్నారు.

# జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో నేటికీ కొనసాగుతున్న వివక్షకు వ్యతిరేకంగా పోరాడుదాం...



**భువనగిరి, ఏప్రిల్ 05(ప్రభాత సూర్య):** బాబు జగ్జీవన్ రామ్ జయంతి స్ఫూర్తితో నేటికీ కొనసాగుతున్న కులవివక్ష, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడుదామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు కొండమడుగు నర్సింహ, అన్నంపట్ల కృష్ణ పిలుపునిచ్చినారు. ఆదివారం బాబు జగ్జీవన్ రామ్ 119 వ జయంతి సందర్భంగా భువనగిరి జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించిన అనంతరం నర్సింహ, కృష్ణ లు మాట్లాడుతూ సామాజిక విప్లవకారుడు, అంతరాల వ్యవస్థ మీద ధిక్కారస్వరమెత్తిన ధీరుడు, సాంఘిక దురాచారాల మీద యుద్ధం ప్రకటించిన యోధుడు, స్వేచ్ఛ స్వాతంత్రం కోసం సమరం సాగించిన వీరుడు, అణగారి వర్గల హక్కుల గొంతుకై దశ దిశలా తమ మాటను వినిపించిన వీరుడు బాబు జగ్జీవన్ రామ్ ని తెలిపారు. నాడు జగ్జీవన్ రామ్ రైల్వే మంత్రిగా, వ్యవసాయ మంత్రిగా, రక్షణ మంత్రిగా, కార్మిక శాఖ మంత్రిగా అనేక సంస్కరణలు తెచ్చి కార్మికుల పక్షాన, రైతుల పక్షాన, పేదల పక్షాన చట్టాలను రూపొందిస్తే నేడు మనువాద బీజేపీ ఆ చట్టాలను రద్దు చేస్తూ బడా పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు, నయా ధనికులకు, భూసాములకు అనుకూలంగా చట్టాలను రూపొందిస్తున్నారని విమర్శించారు. కేంద్రంలో బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపైన, నేటికీ దేశవ్యాప్తంగా దళితులపైన జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలకు వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు సంఘటితంగా పోరాడాలని వారు పిలుపునిచ్చారు.



## ఘనంగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలు

### పాల్గొన్న నాయకులు కార్యకర్తలు

**ప్రభాత సూర్య నర్సాపూర్ ఏప్రిల్ 05 :** సంగారెడ్డి జిల్లా హత్నూర మండల కేంద్రంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి వేడుకను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో హత్నూర మండల అధ్యక్షుడు రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి అనునిత్యం ప్రజల సంక్షేమం కోసం, నియోజకవర్గం అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. అలాగే ఎమ్మెల్యే ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ప్రజలకు ఇంకా ఎక్కువ సేవలు చేయాలని ఆయన అన్నారు. అలాగే రెండు సంవత్సరాల తర్వాత రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి పొంది ప్రజలకు మరింత సేవలు చేయాలని పాల్గొన్న నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకుడు దేవులపల్లి వీరేశం, మాజీ జెడ్పిటిసి ఆంజనేయులు, శివ శంకర్ రావు, నరసింహారెడ్డి, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు పండుగ రవి, మహమ్మద్ ఇబ్రహీం, హత్నూర మాజీ ఉపసర్పంచ్ మేరాజ్, సిరిపురం మాజీ సర్పంచ్ నరేందర్, నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ :సర్పంచ్ చెరుకుపల్లి బీరయ్య



**సంస్థాన్ నారాయణపురం, ఏప్రిల్ 05(ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కొత్తగూడెం గ్రామపంచాయతీ ఆవరణలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలను సర్పంచ్ చెరుకుపల్లి బీరయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం గ్రామ సర్పంచ్ చెరుకుపల్లి బీరయ్య మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్. అలాంటి మహనీయుల సేవలు మరువలేని వని ఆయన ఆశయాలను కొనసాగిద్దామని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాచకొండ సాలమ్మ, వార్డు సభ్యులు గణం శివశంకర్, బాలగోని మల్లేష్,రొమ్ముల సత్యం, గ్రామ పెద్దలు రాచకొండ కృష్ణయ్య, వల్లూరి గాలయ్య, కొమ్ము మల్లేష్, గూడూరు రాజశేఖర్, సిరిపంగి శివాజీ,గ్రామపంచాయతీ సిబ్బంది నందిపాటి అండాలు, రొమ్ముల క్రాంతి, అంతటి లింగస్వామి తదితరులు పాల్గొన్నారు

## మిర్యాలగూడలో అకాల వర్షం... ఆందోళనకు గురైన రైతాంగం



**మిర్యాలగూడ , ఏప్రిల్ 5:-( ప్రభాత సూర్య):** మిర్యాలగూడ పట్టణం పరిసర మండలాల్లో ఆదివారం రాత్రి అకాల స్వల్ప వర్షం కురిసింది ఆందోళనకు గురైన రైతాంగం. రాత్రి ఎనిమిదిన్నర గంటల నుండి పది నిముషాల పాటు స్వల్పంగా చెదురుముదురుగా వర్షం కురిసింది. భారీ వర్షం, వడగళ్ళ వాన కురిస్తే కోతకు వచ్చిన వరి పంటలు నష్ట పోతామనే ఆందోళన చెందారు. వడగళ్లు, గాలి దుమారం లేకుండా వర్షం పడటంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.



## జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో దళితుల సమస్యలు పరిష్కరించండి

### కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు పరశురాములు

**మిర్యాలగూడ , ఏప్రిల్ 5:- (ప్రభాత సూర్య) :** అట్టడుగు వర్గాల పక్షాన కృషిచేసిన జగ్జీవన్ రాం స్ఫూర్తితో రాష్ట్రంలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు రెముడాల పరుశురాములు డిమాండ్ చేశారు ఆదివారం స్థానిక ఈదులగూడ సెంటర్లో జగ్జీవన్ రావు విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన మాట్లాడుతూ చేవెళ్ల ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ అమలుకు నోచుకోవడం లేదన్నారు. దళిత బంధు స్థానంలో అంబేద్కర్ అభయహస్తం ప్రకటించిన ప్రభుత్వం దాన్ని ఎందుకు అటకెక్కించిందో చెప్పాలన్నారు. ప్రభుత్వ సాంస్కృతిక సారధి కళాకారులతో ఏప్రిల్ నెల మహనీయుల మాసంగా పాటిస్తూ కులవివక్ష, అంటరానితనానికి వ్యతిరేకంగా, కులాంతర వివాహాల్ని ప్రోత్సహిస్తూ గ్రామ గ్రామాన విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2026- 27 బడ్జెట్లో దళితులకు భారీ కోత విధించిందని, గత ఏడాది 40 వేల కోట్ల రూపాయలు కేటాయించిన ప్రభుత్వం, ఈసారి కేవలం 17 వేల కోట్లు మాత్రమే కేటాయించిందని విమర్శించారు. రాష్ట్రంలో 143 కుల దురహంకార హత్యలు జరిగాయని, ఇప్పటికైనా కులాంతర వివాహాలకు రక్షణ కల్పిస్తూ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, జగిత్యాల జిల్లాలో 200 గ్రామాలలో వీడీసీల పేరిట అట్టడుగు వర్గాలపై ఆకృత్యాలు, సాంఘిక బహిష్కరణ జరుగుతున్నాయన్నారు. దేవదాసులు, జోగినిల పేరిట దళిత స్త్రీలను అమానవీయంగా జీవితాలు కోల్పోతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేయాలని పౌర హక్కుల పరిరక్షణ చట్టాన్ని ప్రతినెల చివరిలో నిర్వహించాలని, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి సమాన సమాధానమివ్వాలన్నారు.కార్యక్రమంలో నాలుగో వార్డు కౌన్సిలర్ పుట్టపాక శీను మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి 16వ వార్డు కౌన్సిలర్ జనాపాల సునీత, కిరణ్, దళిత సంఘాల నాయకులు దున్న అచ్చాలు, బొల్లంపల్లి పాపారావు, సందీప్ పాల్గొన్నారు.

## రాయల్ సురభి హౌసింగ్ కాలనీ వెంచర్ ప్రారంభించిన- మహమ్మద్ బషీరుద్దీన్



**నల్గొండ ప్రభాత సూర్య :** నల్గొండ పట్టణ సాగర్ రోడ్ లో గల డాన్ బోస్కో స్కూల్ సమీపంలో ఆదివారం రాయల్ సురభి హౌసింగ్ వెంచర్ కాలనీ, మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు గుమ్మల మోహన్ రెడ్డి నిర్వాహకులు మహమ్మద్ బషీరుద్దీన్, మహమ్మద్ అజారుద్దీన్ లు ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా రాయల్ సురభి హౌసింగ్ కాలనీ వెంచర్ అన్ని రకాల ప్రభుత్వ అనుమతులతో నూతనంగా రూపొందించబడిందని, అతి తక్కువ ధరలకు కస్టమర్లకు అందుబాటులో ఉంటాయని, ఈస్ట్ నార్త్ కార్నర్ బిట్లు 12,500 గజానికి, పడమర దక్షిణం ఉత్తర, దిక్కులలో ఉన్న ప్లాట్లకు 11,500 వేల ఐదు వందల రూపాయలు గజముకని అంతేకాకుండా ఈనెల రూపంలో ప్లాట్లు కొన్నట్లయితే పూర్తిగా రిజిస్ట్రేషన్ ఉచితమని మాట్లాడారు ఈ అవకాశాన్ని పట్టణ గ్రామీణ ప్రజలు అందుకు ఉంచుకొని ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ సురభి వెంచర్ కాలనీ నిర్వాహకులు, పట్టణ గ్రామీణ ప్రజలు పాల్గొన్నారు.

## తాసిల్దార్ కార్యాలయం వద్ద బాబు జగ్జీవన్ రామ్ 119 జయంతి వేడుకలు..

**ఆలేరు ఏప్రిల్ 5 ప్రభాత సూర్య:** ఆలేరు మున్సిపాలిటీ పరిధిలో స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో భారత తొలి ఉప ప్రధానమంత్రి బాబు జగ్జీవన్ రామ్ 119 వ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించిన తాసిల్దార్ ఆంజనేయులు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు అని, సంఘ సంస్కర్త, రాజకీయ వేత్తనీ, బీహార్ లోని వెనుకబడిన వర్గాల నుంచి వచ్చాడని తెలిపారు. భారతదేశంలో కేంద్ర మంత్రిగా, తొలి ఉప ప్రధానమంత్రిగా సేవలందించారని తెలిపారు. జగ్జీవన్ రామ్ గారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ కార్యాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## తోటి లారీ డ్రైవర్ కు ఆర్థిక సహాయం

### జై దుర్గా మాత లారీ డ్రైవర్ అసోసియేషన్ 62,000 అందజేత

**సంస్థాన్ నారాయణపురం, ఏప్రిల్ 05(ప్రభాత సూర్య ):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన గవ్వల వెంకటేశ్ తండ్రి మారయ్య ఇటీవల గుండెపోటుతో బాధపడుతూ ఆపరేషన్ చేయించుకోవడం జరిగింది.విషయాన్ని తెలుసుకున్న జై దుర్గ మాత లారీ డ్రైవర్స్ అసోసియేషన్ ఆయనను పరామర్శించి 62,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని వారికి అందజేసీ మానవత్వం చాటుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క లారీ డ్రైవర్ తన ప్రాణాలను కాపాడుకుంటూ డ్రైవర్ వృత్తిని కొనసాగిస్తూ ముందుకు సాగాలన్నారు ఇలాంటివి జరిగినప్పుడు మా యూనియన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జై దుర్గ మాత లారీ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండ వినయ్ గౌడ్, కోశాధికారి రేవనపల్లి ఆంజనేయులు, సదురుపల్లి వెంకటేష్ గౌడ్,గోల్లూరి శ్రీశైలం, అంతటి స్వామి, అంతటి కృష్ణ,పెద్దగోని నరేష్,చేరుకుపల్లి శ్రీశైలం,వలిగొండ లింగస్వామి, పొట్ట లింగస్వామి, గవ్వల శ్రీను,కట్ట మహేందర్, కొంశెట్టి ప్రవీణ్,నవీన్,గంటిల రాజు,గవ్వల మచ్చేందర్ తదితరులు పాల్గొన్నారు

## మున్సిపల్ కార్యాలయం వద్ద బాబు జగ్జీవన్ రామ్ 119 వ జయంతి వేడుకలు...



**ఆలేరు ఏప్రిల్ 5 ప్రభాత సూర్య:** ఆలేరు మున్సిపాలిటీ కార్యాలయం వద్ద స్వతంత్ర సమరయోధులు, భారత తొలి దళిత ఉప ప్రధానమంత్రి బాబు జగ్జీవన్ రామ్ 119 వ జయంతి వేడుక సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళ కార్పొరేషన్ చైర్ పర్సన్ బండ్రు శోభారాణి మాట్లాడుతూ నిరుపేద దళిత కుటుంబంలో జన్మించిన బాబుజీ ఎన్నో అవమానాలు ఎదురైనా దళిత జాతి అభివృద్ధి కోసం, స్వతంత్ర భారతదేశంలో కేంద్ర మంత్రిగా, తొలి ఉప ప్రధాని మంత్రిగా సేవలందించారని కొనియాడారు. జగ్జీవన్ రావ్ వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు నీలం పద్మ వెంకటస్వామి,మున్సిపల్ చైర్మన్ బీజాన బాలమణి భాస్కర్, వైస్ చైర్మన్ అంగడి ఆంజనేయులు, కౌన్సిలర్లు జూకంటి సంపత్, యాట శివ, కాంగ్రెస్ నాయకులు మల్లెల శ్రీకాంత్, మున్సిపల్ సిబ్బంది బాలు .రవి .లింగం . ఏలియా. శ్రీనివాస్ మహేందర్.తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రశాంత్ జన్మదిన వేడుకలు..



**మాదాపూర్ ప్రభాత సూర్య:** మాదాపూర్ డివిజన్ పరిధిలోని సీనియర్ నాయకులు ఎల్లమల ప్రశాంత్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ బస్తివాసులు కార్యకర్తలు స్నేహితులు బంధుమిత్రులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు..

## ఏపీలోని 5 గ్రామాలను తెలంగాణలో కలపండి... అమిత్ షాకు మంత్రి తుమ్మల లేఖ



భద్రాచలం సమీపంలోని ఐదు గ్రామాలను తెలంగాణలో విలీనం చేయాలని కోరుతూ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. పాలనా సౌలభ్యం, స్థానిక గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం ఈ విలీనం అత్యవసరమని ఆయన తన లేఖలో పేర్కొన్నారు.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్-తెలంగాణ సరిహద్దుల్లో ఉన్న ఈ ఐదు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రి తుమ్మల వివరించారు. ఈ గ్రామాలను భద్రాచలంలో విలీనం చేయడం ద్వారా గిరిజనుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఈ అంశంపై ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే విలీనానికి సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించేలా చర్యలు తీసుకోవాలని ఆయన అమిత్ షాను కోరారు.స్థానిక సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపి, సానుకూలంగా స్పందించాలని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.





## కేసీఆర్ క్యాంప్ కార్యాలయంపై కాంగ్రెస్ దాడికి నిరసనగా.. ఆలేరు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముట్టడి..

**ఆలేరు ఏప్రిల్ 5:** మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు (కేసీఆర్) ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై నిన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసిన దాడిని నిరసిస్తూ.. సోమవారం రోజున ఆలేరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, మరియు బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ముట్టడించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో దాడులకు తావులేదని, కేసీఆర్ గారి కార్యాలయంపై దాడి చేయడం అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికార బలంతో ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తోందని, ఇటువంటి భౌతిక దాడులకు తాము భయపడేది లేదని ఆమె హెచ్చరించారు. తక్షణమే దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు...ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్ గౌడ్, కౌన్సిలర్స్ బీజని కళ్యాణి మధు, పాకాల మౌనిక హరీష్, సీనియర్ నాయకులు సిరిగిరి విద్యాసాగర్, ఆడెపు బాలస్వామి, జూకంటి శ్రీకాంత్, మొరిగాడి వెంకటేష్ గౌడ్, పత్తి వెంకటేష్, కుండే సంపత్, కటకం మల్లేశం, పూల శ్రవణ్ కుమార్, అంజన్ కుమార్, కటకం బాలరాజు, కే. వసంత, ఎండి. జమాల్. ఫయాజ్. బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు..

## ఘనంగా తుర్కయంజాల్‌లో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు





**తుర్కయంజాల్,ప్రభాత సూర్య::** అణగారిన వర్గాలు చట్టసభలలో రాజ్యాధికారం సాధించినప్పుడే బాబు జగ్జీవన్ రావ్ కి అసలైన నివాళి అని తుర్కయంజాల్ మాజీ కౌన్సిలర్ కొత్త కురుమ మంగమ్మ శివకుమార్ అన్నారు.ఆదివారం ఆదిభట్ల సర్కిల్,తుర్కయంజాల్ డివిజన్ కూడలిలో బాబు జగ్జీవన్ రామ్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మేతరి శ్రీధర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బాబు జగ్జీవన్ రామ్ 119 వ జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి తుర్కయంజాల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు,మాజీ కౌన్సిలర్ కొత్త కురుమ శివకుమార్,ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సుదీర్ఘకాలం చట్టసభలలో ఉన్నటువంటి వ్యక్తి బాబు జగ్జీవన్ రామ్ అని నేడు దేశ వ్యాప్తంగా అమలవుతున్న ఎన్నో కార్మిక చట్టాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. అణగారిన వర్గాల చట్టసభలలో రాజ్యాధికారంలో ఉండి అ వర్గాల తరఫున హక్కులు సాధించడమే బాబు జగ్జీవన్ రామ్ కి ఇచ్చే అసలైన నివాళి అని, ప్రతి ఏటా ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్ డివిజన్ ఆధ్వర్యంలో మహనీయుల కార్యక్రమాలకు ఘనంగా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి,అసిస్టెంట్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర నాయకులు బచ్చిగల్ల రమేష్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు చెక్క బాలనర్సింహ, నాయకులు కొమ్మని దర్శన్,గుడ్ల శ్రీనివాస్, కానపురం దాస్,గుడ్ల అర్జున్,చెక్క ధనరాజ్,కొత్త కురుమ శ్రీశైలం,ఫైసల్ అలీ,మేతరి కుమార్ పాల్గొన్నారు.

## ఘనంగా భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలు






### పాల్గొన్న దళిత సంఘాల నాయకులు.

**ప్రభాత సూర్య నర్సాపూర్ ఏప్రిల్ 05 :** భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా సంగారెడ్డి జిల్లా హత్నూర మండల కేంద్రంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాదిగ ఉద్యోగ సంఘం జాతీయ నాయకుడు నర్సింలు మాట్లాడుతూ మహనీయులను స్మరించుకోవడం సంతోషించదగ్గ విషయమని, ఆ రోజుల్లోనే పార్లమెంట్లో వివక్షతను ఎదుర్కొన్న వ్యక్తుల్లో ఆయన ఒక్కడిని తెలిపారు. అంటరాని తనం నిర్మూలన కోసం, దళితుల, వెనుకబడిన తరగతుల సాధికారత కోసం కృషిచేసిన నేత బాబు జగ్జీవన్ రామ్ అని ఆయన కొనియాడారు. బాబు జగ్జీవన్ రామ్ ఒక కులానికో ఒక వర్గానికో పరిమిత నాయకుడు కాదని ఒక సామాజిక విప్లవకారుడని అన్నారు. దేశం కోసం అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి బాబు జగ్జీవన్ రామ్ అని అన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చూపిన మార్గంలోనే నడవాలని యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హత్నూర సర్పంచ్ ఎల్లయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మైస గల్లభూచెంద్ర, వీరయ్య, మాజీ ఉపసర్పంచ్ మెరాజ్, వార్డ్ మెంబర్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.



## హైదరాబాద్‌లో ఘోరం.. స్కూటీని ఢీకొట్టి కిలోమీటర్ ఈడ్చుకెళ్లిన డీసీఎం.. మహిళ మృతి



హైదరాబాద్ ఐటీ హబ్ మాదాపూర్‌లో శనివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఓ డీసీఎం వాహనం స్కూటీపై వెళుతున్న దంపతులను వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో స్కూటీ వెనుక కూర్చున్న మహిళ వాహనం కింద చిక్కుకోగా, డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా దాదాపు కిలోమీటర్ దూరం ఈడ్చుకెళ్లాడు. ఈ దుర్ఘటనలో హనియా ఆయేషా (22) అనే యువతి అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె భర్త అబ్దుల్ బాసిత్ (26) తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం కేరళకు చెందిన ఈ దంపతులు నగరంలోని మలబార్ గోల్డ్ స్టోర్‌లో పనిచేస్తున్నారు. శనివారం రాత్రి కూకట్‌పల్లిలో సినిమా చూసి తిరిగి మహేశ్వరంలోని తమ ఇంటికి వెళ్తుండగా మైండ్‌స్పేస్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. డీసీఎం ఢీకొన్న వేగానికి అబ్దుల్ బాసిత్ రోడ్డు పక్కన పడిపోగా, ఆయేషా స్కూటీతో పాటు డీసీఎం కింద చిక్కుకుంది. వాహనం కింద నుంచి మంటలు, అరుపులు వస్తున్నా డ్రైవర్ వాహనాన్ని ఆపలేదు. ఇది గమనించిన స్థానికులు, ఇతర వాహనదారులు డీసీఎంను వెంబడించి అడ్డుకున్నారు. వెంటనే డ్రైవర్ అక్కడి నుంచి పరారవ్వగా, క్లీనర్‌ను పట్టుకున్న జనం దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆయేషా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అబ్దుల్ బాసిత్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స అందిస్తున్నారు. కర్ణాటక రిజిస్ట్రేషన్ ఉన్న ఈ వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతురాలి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.